క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన



సత్తెనపల్లి: పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, ధూళిపాళ్ల సహకారంతో కాకతీయ జన సేవా సమితి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి సమస్యలున్న 450 మంది పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 110 మందికి మందులు అందించి, 95 మందికి కళ్లజోళ్లు, 102 మందికి శస్త్రచికిత్సలు ఉచితంగా అందించనున్నట్లు నిర్వాహకులు ఎల్లినేడి రామస్వామి, రావెల చంద్రశేఖర్ తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్న సంతర్పణ



సత్తెనపల్లి: పట్టణంలోని ఆదరణ అనాథ వృద్ధాశ్రమంలో గుర్రం జాషువా సేవా సంస్థ ఆధ్వర్యంలో గోసి ఐజయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీపీఐ సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి పి.ఇర్మియా, సేవా సమితి సభ్యులు గుజ్జర్లపూడి జాన్ బాబు, గుజ్జర్లపూడి జయకుమార్, గుజ్జర్లపూడి సురేష్ బాబు, న్యాయవాది బొక్క సంగీతరావు, గుజ్జర్లపూడి స్టాన్లీ ఆశ్రమ నిర్వాహకులు కొమ్మవరపు ఇంద్ర సేనబాబు, కొల్లా శరత్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



గోళ్ళపాదు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు ప్రసన్నాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం హనుమత్ దీక్ష విరమణ కార్యక్రమం జరిగింది. భక్తులు స్వామి వారికి పొంగళ్లు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. సామూహిక ఆకు పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం హనుమత్ జ్యోతి దర్శనం గావించారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామ సర్పంచ్ గోపు అప్పమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి, ఆర్.వెంకటేశ్వరరెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం నాయకులు అచ్యుత శివప్రసాదు, బర్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి



సత్తెనపల్లి: వైఎస్ఆర్ సీపీ నాయకుడు షేక్ ఆదం షఫీ అలియాస్ నన్నే (54) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఒక్కసారిగా గుండె నొప్పి రావడంతో హుటాహుటిన ఆయనను పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదం షఫీ తుదిశ్వాస విడిచారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పట్టణంలోని 28వ వార్డుకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడిగా ఆదం షఫీ క్రియాశీలకంగా పని చేశాడు. ఆయన మృతి చెందారన్న వార్త తెలియడంతో స్థానిక నాయకులు పెద్ద ఎత్తున వైద్యశాలకు తరలి వెళ్లారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గోడౌన్‌లో అగ్నిప్రమాదం

నాదెండ్ల: గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీ సమీపంలో ఉన్న కృష్ణవేణి సీడ్స్ గోడౌన్‌లో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది వివరాల మేరకు మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో సీడ్ కంపెనీ గోడౌన్‌లో తూర్పు వైపున మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని, మంటలను అదుపు చేశారు. గోడౌన్ ప్రాంగణంలో ఇటీవల యాజమాన్యం చెత్తాచెదారాలు తొలగించి ఒక మూలన వేయించింది. దీంతో అటుగా వెళ్లే ఆకతాయిలు సిగిరేట్ పడవేయటంతో మంటలు వ్యాపించాయని అనుమానిస్తున్నారు. వ్యర్థాల్లో కెమికల్ డ్రమ్ ఉండటంతో మంటలు తీవ్రమయ్యాయి. సకాలంలో మంటలు ఆర్పటంతో గోడౌన్ సమీపంలో కాలనీ వాసులు ఇళ్లకు ప్రమాదం తప్పినట్లయింది. ఎలాంటి ఆస్తినష్టం సంభవించలేదు.

అవగాహనతోనే చైతన్యం

- కౌమార బాలబాలికలకు ప్రత్యేక కార్యక్రమాలు
- మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన
- ఆర్‌బీఎస్‌కే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం



కౌమార బాల,బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది

సత్తెనపల్లి: నేటి బాలలే రేపటి పౌరులు. కౌమార దశలో వారిని పలు అంశాలపై చైతన్య పరచాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 10 నుంచి 19 ఏళ్ల లోపు వారికి రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమానికి (ఆర్‌బీఎస్‌కే) ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పలు అంశాలపై వైద్యుల పర్యవేక్షణలో ప్రతి శుక్రవారం ఆడపిల్లలకు, శనివారం మగ పిల్లలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి గురువారం రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. సత్తెనపల్లి డివిజన్ పరిధిలో మున్సిపాలిటీతో పాటు 9 మండలాలకు సంబంధించి ఏరియా వైద్యశాల ఒకటి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 5, అర్బన్ హెల్త్ సెంటర్‌లు 3, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు 56, సబ్ సెంటర్లు 58, పంచాయతీలు 166 ఉన్నాయి. వీటి పరిధిలో పది నుంచి 19 ఏళ్ల లోపు వారు సుమారు 50 వేల మంది ఉన్నారు. వీరికి ఆర్‌బీఎస్‌కే ద్వారా వైద్య పరీక్షలతో పాటు మానసిక వికాసానికి సలహాలు, సూచనలు అందిస్తున్నామని వైద్యులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా ఇప్పటికీ కొన్నిచోట్ల బాల్య వివాహాలు చేసేందుకు తల్లిదండ్రులు త్వరపడుతున్నారు. వీటిని నియంత్రించేందుకు ఐసీడీఎస్, రెవెన్యూ శాఖల అధికారులు సదస్సులు నిర్వహిస్తున్నారు.

దృష్టి పెట్టిన అంశాలు..

- శారీరక మార్పులతో వచ్చే సందేహాలను నివృత్తి చేసి, తప్పులు చేయకుండా మార్గ నిర్దేశం చేయడం.
- మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని.. వాటి వల్ల కలిగే అనర్థాలను తెలియపరచడం.
- 7వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించడం.
- బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతుందనే విషయాన్ని తల్లిదండ్రులకు వివరించడం, చైతన్య పరచడం.
- కౌమార దశలో బాలబాలికలకు ఆరోగ్యపరమైన సమస్యలను పరిశీలించడం.

సామాజిక సమానత్వం చూపిన సీఎం వైఎస్ జగన్

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు
- వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం



చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న పెండెం బాబురావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం

సత్తెనపల్లి: సామాజిక సమానత్వం చూపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం రాత్రి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక సమానత్వం గత ప్రభుత్వ హయాంలో కాగితాలపై ఉండేదన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా దళిత సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించారని, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా గిరిజన సామాజిక వర్గానికి చెందిన రమావత్తు కోటేశ్వరరావు నాయక్... ఇలా బడుగులకు మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలో అవకాశం ఇచ్చారన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేయకుండా, వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అనంతరం చైర్మన్‌గా పెండెం బాబురావు(సత్తెనపల్లిటౌన్), వైస్ చైర్మన్‌గా కళ్ళం శివరామిరెడ్డి (దమ్మాలపాడు), డైరెక్టర్లుగా షేక్ మస్తాన్‌బీ (సత్తెనపల్లి), దుగ్గెంపూడి రఘురామిరెడ్డి (పెద మక్కెన), ఆళ్ల జగన్నాథం(నందిగామ), కామినేని వెంకటప్పయ్య(ధూళిపాళ్ల), గంగూరు విజయ లక్ష్మి(గుజ్జర్లపూడి), మారుబోయిన మల్లమ్మ (కంకణాలపల్లి), బత్తుల వెంకాయమ్మ (కుందురువారిపాలెం), మేడ సామ్రాజ్యం(చాగంటివారిపాలెం), ప్రత్తి అప్పారావు (గోళ్ళపాడు), గొర్రెపాటి వైడూర్య (రుద్రవరం), దేవరశెట్టి రవికుమార్ (సత్తెనపల్లి), బచ్చు వరలక్ష్మి (సత్తెనపల్లి), షేక్ జానమ్మ (సత్తెనపల్లి) పాలకవర్గం చేత ఆర్‌జేడీఎం కాకుమాను శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కమిటీని ప్రత్యేకంగా పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో యార్డ్ ఉన్నతశ్రేణి కార్యదర్శి భాస్కరరెడ్డి, యార్డ్ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వీఆర్‌ఏపై దాడి దుర్మార్గం

వీఆర్‌ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రవిబాబు



మాట్లాడుతున్న రవిబాబు, పక్కన నాయకులు

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం కొమెరపూడి వీఆర్‌ఏ కోరబండి శ్రీనివాసరావుపై దాడి చేసిన సత్తెనపల్లి తమసీల్దార్ కె.నగేష్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని వీఆర్‌ఏల సంఘం పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షుడు గంజిమాల రవిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బందగి సాహెబ్ అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యి, మాట్లాడారు. అనారోగ్యంతో ఉన్న వీఆర్‌ఏపై దాడి చేయడం తహసీల్దారు అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. తహసీల్దార్ నగేష్‌ను కలెక్టర్ సస్పెండ్ చేయాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో దళిత, గిరిజన, ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ వీఆర్‌ఏల సంఘానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు చేస్తున్న మాజీ జిల్లా కార్యదర్శి వెంకటరత్నం, పొలేష, బొల్లాపల్లి మండలానికి చెందిన నాగేశ్వరావును సంఘం బాధ్యతల నుంచి తొలగిస్తూ రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వీఆర్‌ఏల సంఘానికి వారికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నూతన జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆనందరాజు, 37 మందితో పల్నాడు జిల్లా వీఆర్‌ఏల సంఘం ఎన్నికయినట్లు వెల్లడించారు. సీఐటీయూ సత్తెనపల్లి కార్యదర్శి ఎం.హరిపోతురాజు, పి.మహేష్, వీఆర్‌ఏల సంఘం జిల్లా నాయకులు పి.సంజీవరావు, కోట సుబ్బారావు, సత్యవతి, ఆనంద్ కుమార్, టి.రవి, కోటేశ్వరరావు, కాసులు, అంజి, వంశీ, రమేష్, షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం

నకరికల్లు: త్రైత సిద్ధాంత భగవద్గీత పఠనంతో ఆధ్యాత్మిక విజ్ఞానం పెంపొందుతుందని ప్రబోధ సేవా సమితి చిలకలూరిపేట, ఒంగోలు కమిటీ అధ్యక్షులు వీరాంజనేయులు, సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలోని కండ్లకుంట గ్రామంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని భగవద్గీత చదవడం ద్వారా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చిలుకలూరిపేట, ఒంగోలు కమిటీ సభ్యులు ఆకుల వెంకటరావు, వై.రామాంజనేయులు, చిర్రా వెంకటరామిరెడ్డి, గంగయ్య, సామ్రాజ్యమ్మ, కోమలి, కోటేశ్వరమ్మ, మేకల వెంకటేష్, అరుణ, పుల్లయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

27న ఈ-కేవైసీ గడువు ముగింపు

నకరికల్లు: రబీలో సాగుచేస్తున్న పంటలకు ఈ-కేవైసీ నమోదు చేసుకునేందుకు గడువు సోమవారంతో ముగుస్తుందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటలకు బీమా కోసం ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సదరు రైతులు ఈ-కేవైసీ చేయాలని తెలిపారు.

ఈత పోటీల్లో హనుమంతరావు ప్రతిభ

సత్తెనపల్లి: స్విమ్మింగ్‌లో సత్తెనపల్లికి చెందిన నిమ్మగడ్డ హనుమంతరావు ప్రతిభ కనబరిచారు. విజయవాడలో ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 23వ కృష్ణా రివర్ క్రాస్ సిమ్మింగ్ పోటీల్లో సత్తెనపల్లి స్విమ్మింగ్ గ్రూప్ సభ్యులు డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, డాక్టర్ జి.శ్రీధర్, డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ ఎస్.రాజమోహన్ రెడ్డి, షేక్ మహమ్మద్ గని, ఆకుల హనుమంతరావు, నిమ్మగడ్డ హనుమంతరావు, పోతుగంటి నరసింహరావు, కరిముల్లా చౌదరి, రాజేష్, తిరుపతిరావు, నన్నే, బుజ్జి, బుడే పాల్గొన్నారు. పోటీల్లో 60 ప్లస్ ఏజ్‌లో నిమ్మగడ్డ హనుమంతురావు ప్రతిభ చూపి తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా నిమ్మగడ్డ హనుమంతరావుతో పాటు స్విమ్మింగ్ గ్రూప్ సభ్యులను పలువురు అభినందించారు.

ఇదేనా టీడీపీ క్రమశిక్షణ...

తన సస్పెన్షన్‌పై పార్టీ సీనియర్ నేత నూతలపాటి ఆగ్రహం



పెదకూరపాడు: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌పై ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, సీనియర్ నేత నూతలపాటి వెంకట శివరావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవి ఆంజనేయులు తన వియ్యంకుడు కొమ్మాలపాటి చెప్పుడు మాటలు విని తనకు ఏలాంటి షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా పార్టీ నుంచి ఏలా సస్పెండ్ చేస్తారంటూ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఆదివారం పరస గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించి, ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు చేతుల మీదగా 40ఏళ్ల క్రితం టీడీపీలో సభ్యత్వం తీసుకొని, పెదకూరపాడు మండల తెలుగు యువత అధ్యక్షుడిగా, ఉమ్మడి గుంటూరు జిల్లా పార్టీ కార్యదర్శిగా, మూడు పర్యాయాలు గ్రామ సర్పంచ్‌గా, ప్రస్తుతం పల్నాడు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధిగా తెలుగుదేశానికి సేవలు అందిస్తే అన్యాయంగా తనను సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకోసం 20 ఎకరాలు అమ్ముకున్నానని, ఆర్థికంగా నష్టపోయానని, పార్టీకి ఇంతలా సేవలు అందించిన తనను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తొలగించడంపై మండిపడ్డారు. ఇదేనా.. టీడీపీ క్రమశిక్షణ అని ప్రశ్నించారు. జీవీ ఆంజనేయులు, కొమ్మాలపాటి శ్రీధర్ తమ అవసరాల కోసం టీడీపీని తాకట్టు పెట్టి, రాజకీయ వ్యాపారం చేస్తోంది నిజం కాదా అని దుయ్యబట్టారు. వ్యాపారాలు, కాంట్రాక్టుల కోసం చీకట్లో ఏవరు ఏవరితో కలిశారో అందరికీ తెలునని, ఆధారాలతో నిరూపిస్తే తనకంటే ముందుగా రాష్ట్ర పార్టీ వారినే శాశ్వతంగా బహిష్కరిస్తుందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ అధ్యక్షుడిగా జీవీ ఆంజనేయులు వచ్చిన నాటి నుంచి తెలుగుదేశం పతనావస్థలోకి వెళ్లిందన్నారు. వినుకొండలో ఆంజనేయుల చరిత్ర ఏంటో ప్రతి గడపకు తెలుసునన్నారు. తాను పార్టీ కోసం ఆస్తులు అమ్ముకుంటే , వియ్యంకులిద్దరూ.. ఆస్తులు పొగేసుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ స్పిన్నింగ్ మిల్లులో అండర్ గ్రౌండ్ కేబుల్ వేసి దొంగ కరెంటు వాడటంతో.. కోటి రూపాయలు ఫైన్ వేస్తే.. ఎవరి సహాయ, సహకారాలతో బయటపడ్డారో బహిర్గితం చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల ఎస్‌ఎస్‌పీ కాలనీలో వేంచేసియున్న నిదానంపాటి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వర్‌రెడ్డి, సానికొమ్ము కోటిరెడ్డి, మోరా సాంబిరెడ్డి, నారాయణరెడ్డి, ఆలయ ధర్మకర్తలు బాణా దుర్గారెడ్డి, నంద్యాల సత్యనారాయణ రెడ్డి, పొన్నపాటి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మతల్లి తిరునాళ్ల



అమ్మవారిని దర్శించుకొన్న మంత్రి అంబటిరాంబాబు

రాజుపాలెం: రాజుపాలెం గ్రామంలో కొలువు దీరిన అంకమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి రాజుపాలెం-గంగిరెడ్డిపాలెం గ్రామస్తులు తొలి ధాన్యంతో పొంగళ్ల చేసి మేళతాళాలతో బోనాలను సమర్పించారు. అమ్మవారికి చీర, సారెలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోలాటాలు, భజనలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి అర్వపల్లి కోటినారాయణమూర్తి మంత్రిని పూర్ణకుంభంతో ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాల్వ ఆదినారాయణ, ఆర్బీకే సలహా మండలి చైర్మన్ కేదారినాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి అంబటి ప్రారంభించారు. నవోదయ విద్యార్థినుల కోలాటం ఆకట్టుకుంది. సర్పంచ్ పులిబండ్ల అశోక్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీపీ బాసులింగారెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రిసుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్తెమ్మతల్లి ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన శ్రీ సత్తెమ్మతల్లి

అచ్చంపేట: సత్తెమ్మతల్లి ఉత్సవాలు సోమవారం నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గుడారి గోపీ ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని మాదిపాడు పంచాయతీ, పులిచింతల ప్రాజెక్టు చేరువులోని అటవీ ప్రాంతంలో స్వయంభుగా వెలసిన అమ్మవారి ఆలయంలో సోమవారం అఖండ జోతి ప్రజ్వలన, అంకురార్పణ, ఉత్సవ మూర్తులకు అభిషేకాలు జరుగుతాయని చెప్పారు. మంగళవారం జడపల్లి తండా, కంచుబోడు తండాలలో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. మార్చి 1న సత్తెమ్మతల్లి సత్యదేవుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానం పలికారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. మాలధారులతో ఏడేళ్ల నుంచి సత్తెమ్మ తల్లి, సత్యదేవుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు భక్తుడు యర్రంశెట్టి శ్రీనివాసరావు, సత్యవతి దంపతులు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు చెప్పారు.

స్విమ్మర్లకు సత్కారం



సత్కారం అందుకుంటున్న నిమ్మగడ్డ, పోతుగంటి

సత్తెనపల్లి: ఈత పోటీల్లో ప్రతిభావంతులను ఆర్య వైశ్య సేవా సమితి అధ్యక్షుడు వెలుగురి శరత్‌బాబు సత్కారించారు. పట్టణంలోని వావిలాల స్మృతి వనంలోని డెక్ వేవ్‌లో ఆదివారం అభినందన కార్యక్రమం జరిగింది. విజయవాడలో జరిగిన 23వ కృష్ణా రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీల్లో సత్తెనపల్లి బృందం నుంచి పాల్గొని, మూడవ బహుమతి అందుకొన్న నిమ్మగడ్డ హనుమంతురావు, ఈత పోటీల్లో పాల్గొంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న పోతుగంటి నరసింహరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద చైతన్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీధర్, గని, నన్నే, దాసరి తిరుపతిరావు, కాపుగంటి వెంకటరత్నం, సమితి గౌరవ అధ్యక్షుడు జమిలి రాధా కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి దివ్వెల శ్రీనివాసరావు, కోశాధికారి మద్ది వెంకటేశ్వర రావు, కొత్తూరి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న పాస్టర్ ఫిలిప్

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చర్చి ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా పందుల సాల్మన్‌రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా శిఖా ఆనందరావు, వైస్ సెక్రటరీగా కట్టెంపూడి నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా పాలెపోగు డానియేలు, సభ్యులుగా యెనుబరి వరప్రసాద్, బెజవాడ రూబెన్‌రాజు, కత్తి జాన్‌కృపాదానం, గుంటూరు అబ్రహం లింకన్, కట్టెంపూడి మణిరాజ, పులిమెల కిరణ్‌కుమార్, పచ్చిగొర్ల ప్రభాకర్, దోరడ్ల పోలయ్య, కొండ్రముట్ల పృథ్వీరాజ్, గొల్లపూడి జాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సంఘ కాపరి రెవ. పత్రా ఫిలిప్ నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘ పెద్దలు బేతం శ్యాంప్రసాద్, చాట్ల రామయ్య, గద్దల ప్రేమనాథ్ ప్రకాష్, గద్దల ఆశీ వరప్రసాద్, జడ్పీ కో-ఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, వందనం, పందుల ఫిలిప్, కొదమల కాలేబురాజు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష గోవింద నామార్చన హోమం

వినుకొండ టౌన్: లక్ష గోవింద నామార్చన కార్యక్రమాన్ని పట్టణంలోని శ్రీనివాస నగర్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్.శ్రావణ్ కుమార్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 158 మంది మహిళా భక్తులచే నిర్వహించడం జరిగిందని ఆలయ అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య తెలియ చేశారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కాళ్ల రామకోటేశ్వరరావు, అచ్యుత సుబ్బారావు, వెంకట సుబ్బయ్య, అన్న వీరబ్రహ్మం, గుడిపాటి కోటేశ్వరరావు, గుడిపాటి బాలసుబ్రహ్మణ్యం, మోటమర్రి నాగేశ్వరరావు, కమిటి సభ్యులు, ఆలయ సిబ్బంది, మహిళా భక్తులు పాల్గొన్నారు.

గణపవరం విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసలు



విద్యార్థులకు మెమెంటోలు అందిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ శివశంకర్ అభినందించారు. శనివారం ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు పత్తిపాటి నాగయశ్వంత్ (10వ తరగతి) వజ్రాల కార్తిక్‌రెడ్డి (9) సీహెచ్ సాత్విక (8)లు ఇటీవల చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి మెమెంటోలను అందించారు. మీ పాఠశాలకు త్వరలో వస్తానంటూ కలెక్టర్ వారితో చెప్పారు. పల్నాడు జిల్లాలోని జిల్లా పరిషత్, కస్తూర్బాగాంధీ, మోడల్ పాఠశాలలకు చెందిన ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులతో ప్రతి శనివారం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ముఖాముఖి నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతం, స్పోర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ తదితర అంశాలపై ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల వెంట హెచ్‌ఎం టి.సత్యనారాయణ, గణిత ఉపాధ్యాయుడు వెంకటరమణ ఉన్నారు.

విద్యారంగ మార్పులపై అధ్యయనం అవసరం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నరసరావుపేట ఈస్ట్: విద్యారంగంలో చోటుచేసుకుంటున్న మార్పులను ఉపాధ్యాయులు అధ్యయనం చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. నూతన విద్యావిధానం వల్ల జరిగే పరిణామాలను గుర్తించాలని తెలిపారు. పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం యూటీఎఫ్ పల్నాడుజిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ, విద్యారంగంలో వస్తున్న మార్పులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాదు, రాష్ట్ర నాయకులు మల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు, ఎస్.కుమారరాజా, ఎ.నాగేశ్వరరావు, ఎస్.సుందరరావు పాల్గొన్నారు.

వైభవంగా పువ్వాడమ్మ తిరునాళ్ల

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని పువ్వాడ గ్రామంలో వేంచేసి ఉన్న పువ్వాడమ్మ తిరునాళ్ల ఆదివారం వైభంగా జరిగింది. గ్రామ దేవత పువ్వాడమ్మ తిరునాళ్లకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉపవాసం ఉన్న మహిళలు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. మెక్కుబడి ప్రభలను, ఎడ్ల బండ్లను దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి సంప్రదాయాన్ని చాటుకున్నారు. గ్రామ దేవతకు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు, గాజులు సమర్పించారు. తిరునాళ్ల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత మక్కెన మల్లికార్జున రావు, ఆలయ ధర్మకర్తలు అప్పరాజు వెంకటనారాయణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. తిరునాళ్లకు ఉమ్మడి గుంటూరు జిల్లానుంచే కాకుండా ఉమ్మడి ప్రకాశంజిల్లా మక్కెనవారిపాలెం, జమ్ములమడక, అద్దంకి, బీమారం గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి కాసుల గోవిందరాజులు ఆధ్వర్యంలో అమ్మవారిని పట్టువస్త్రాలతో పూలమాలలతో ప్రత్యేక అలంకారాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. భారీవిద్యుత్ ప్రభలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఐనవోలు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.